నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 16-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 68 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

-వంతెనను కారు ఢీకొని ఐదుగురు మృతి

డెహ్రాడూన్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. తెహ్రీ జిల్లా నైన్ బాగ్ లో తెల్లవారుజామున కారులో లోయలో పడి ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించారు. అయితే మృతులంతా బంధువులంటున్న పోలీసులు.. అతి వేగమే ప్రమాదానికి కారణమంటున్నారు. నైన్‌బాగ్ సమీపంలో వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి వంతెనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

జాతి గర్వించదగ్గ వ్యక్తి కలాం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): దివంగత భారత మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జాతి గర్వించదగ్గ వ్యక్తి అని ప్రధాని మోదీ అన్నారు. కలాం జ జయంతి సందర్భంగా ప్రధాని.. కలాం జ్ఞాపకాలను ట్విట్టర్ ద్వారా నెమరువేసుకున్నారు. రక్షణ రంగంలో కలాం చేసిన కృషి ఎన్నటికీ మరిచిపోలేమన్నారు. రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలు ఆదర్శనీయం. ఎంత ఉన్నతమైన స్థానాలు అధిరోహించి నప్పటికీ.. ఆయన సాధారణ జీవితం గడిపారనీ, వ్యక్తిగతంగా ఎలాంటి ఆస్తులు సంపాదించుకోలేరని ఈ సందర్భంగా ప్రధాని అన్నారు. పుస్తకాలే ఆయన ఆస్తి అని మోదీ అన్నారు. ఆయనను కలుసుకున్న క్షణాలు నా మనసులో ఇప్పటికీ పదిలంగా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. భారత్ రక్షణరంగంలో బలపడడానికి ప్రధాన వ్యక్తి కలాం అని ఈ సందర్భంగా ప్రధాని అన్నారు.

అబ్దుల్ కలాంకు డీఆర్‌డీవో నివాళి

మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఢిల్లీలోని డీఆర్‌డీవో భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్, ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్, ఎయిర్ చీఫ్ భదౌరియా, నేవీ చీఫ్ కరంబీర్ సింగ్, డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్ రెడ్డిలు.. కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా 41వ డీఆర్‌డీవో డైరక్టర్ల సమావేశాన్ని నిర్వహించారు. కొత్త టెక్నాలజీని ఆశ్రయించాల్సి అవసరం ఉందని నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ తెలిపారు. అమెరికాలో ఉన్నటువంటి డర్పా లాంటి మోడళ్లను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న తరహా ఆవిష్కర్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నేవీ చీఫ్ చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆయుధాలతో యుద్ధం చేసి గెలుస్తామని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ తెలిపారు. సైబర్, స్పేస్, లేజర్, ఎలక్ట్రానిక్, రోబోటిక్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలని బిపిన్ రావత్ చెప్పారు.

యూపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం

- 25వేల మంది హోంగార్డుల తొలగింపు

లక్నో, అక్టోబర్15(ఆర్ఎన్ఎ) : ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 25వేల మంది హోంగార్డులను ఇంటికి పంపించేందుకు సిద్ధమైంది. బ్జడెట్ లేదన్న కారణంతో దీపావళి పండుగకు కొద్దిరోజుల ముందు ఉద్యోగుల తొలగింపు నిర్ణయంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూపీ పోలీస్ డిపార్ట్‌మెంట్ హోంగార్డుల తొలగింపుపై తుది నిర్ణయం తీసుకుంది. వీరిలో ఎక్కువ మంది ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. మరో 99వేల మంది హోంగార్డులు ఇకపై నెలలో 25 రోజులకు బదులుగా 15 రోజులు మాత్రమే విధులకు రావాలని సూచించింది.

కేవలం 15 రోజులు మాత్రమే ఉపాధి కల్పిస్తామని పేర్కొంది. పోలీస్ కానిస్టేబుళ్ల మాదిరిగానే హోంగార్డులకు కూడా డైలీ అలవెన్స్(డీఏ) అందజేయాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. వేలాది మందికి అలెవెన్స్ చెల్లించడం ప్రభుత్వానికి భారంగా మారిందని యోగీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పోలీసు శాఖలో ఖాళీల భర్తీని గతేడాదే చేపట్టారు. ఇప్పుడు వారందరని తొలగిస్తుండటం

గమనార్హం. గతంలో రోజువారీ భత్యం కింద వీరికి కేవలం రూ.500 మాత్రమే చెల్లించేవారు.. సుప్రీం తీర్పు అనంతరం ఆ మొత్తాన్ని రూ.672కు పెంచారు. 99వేల మంది హోంగార్డుల పనిదినాలను 15 రోజులకు కుదించడంతో వారంతా తక్కువ భత్యాన్ని అందుకోనున్నారు. దీంతో వీరిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వం వహించేందుకు తానుసిద్ధమే!

- కానీ కేసీఆర్ నుంచి తనకు ఎలాంటి అనుమతిలేదు
- సీఎంతో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నా
- ఇంకా అందుబాటులోకి రాలేదు
- ఉద్యోగ సంఘాల నేతలు ఐక్యంగా ఉండాలి
- టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కేశవరావు

హైదరాబాద్, అక్టోబర్15(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వం మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు తాను సిద్ధమని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచన తనకు రాలేదని తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె. కేశవరావు అన్నారు. తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో కేసీఆర్ చర్చల ప్రసక్తే లేదంటూ ప్రకటిస్తే.. కేశవరావు చర్చలకు సిద్ధంకండంటూ పత్రికా ప్రకటన విడుదల చేసి సంచలనం సృష్టించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో తాజా గా కేశవరావు మాట్లాడుతూ.. చర్చలు జరపడానికి నేనెవరినంటూ పేర్కొని అందరికీ షాకిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికులతో చర్చలు జరపడానికి తనకు ఎలాంటి అధికారం లేదన్నారు. ఇది ప్రభుత్వ సమస్య అని, పార్టీ సమస్య కాదని తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు చేజారుతున్నాయని.. ప్రభుత్వం, కార్మికులు పరస్పరం చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మాత్రమే తాను సూచించానన్నారు. ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరుపుతానని తాను ఎప్పుడు చెప్పలేదన్నారు. అయితే మంచి జరుగుతుందనుకుంటే.. మధ్యవర్తిత్వం వహించేందుకు తాను సిద్ధమే అన్నారు. కార్మికులు తనతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉండటం మంచి పరిణామంగా కేశవరావు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం తరఫున చర్చలు జరిపేందుకు తనకు ఎలాంటి అనుమతి రాలేదని కేకే స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి ముఖ్యమంత్రితో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. అయితే సీఎం ఇంకా తనకు అందుబాటులోకి రాలేదన్నారు. తాను సోషలిస్టునని.. రాజ్యం వైపు కాక కార్మికుల వైపే ఉంటానని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు కొట్టుకోకుండా కలసికట్టుగా ఉండాలని కేకే సూచించారు. ప్రభుత్వం ఆర్టీసీని విలీనం చేస్తానంటే తనకేమీ అభ్యంతరం లేదన్నారు. అయితే ఆర్టీసీ విలీనం సాధ్యపడకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇది కేవలం తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే అని కేకే స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్దేశం ఏంటనేది తనకు తెలియదని.. ఒకవేళ తెలిస్తే.. సమస్య పరిష్కారం అయ్యేదని కేశవరావు అన్నారు.

ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలి

- సీఎం కేసీఆర్ మొండి వైఖరిని విడనాడాలి
- ఉద్యోగులు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దు
- ఆందోళన ఉధృతంచేసి హక్కులు సాధించుకుందాం
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు
- 19న బంద్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, అక్టోబర్15(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలని, వారిని చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు అన్నారు. మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు తమ్మినేని వీరభద్రంతో కలిసి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాఘవులు తెలిపారు. ఆర్టీసీ సమ్మె ప్రారంభించి11రోజులు అవుతున్నా.. ప్రభుత్వం ఇంతవరకు చర్చలకు కూడా నిర్వహించకుండా అణిచివేస్తుందని రాఘవులు అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇది విరుద్ధమని అన్నారు. ఆర్టీసీ ని సీఎం కెనడా మోడల్ లో విచ్ఛిన్నం చేయాలని చూస్తే కెనడాలో ఏర్పడిన పరిస్థితి ఇక్కడ కూడా ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల ను చర్చలకు పిలవాలి కానీ.. సమ్మె విరమించి రండి చర్చలు జరుపుతాం అనడం భావ్యం కాదన్నారు. సమ్మె అనేది కార్మికుల హక్కు అని, అది రాజ్యాంగంలో కూడా ఉందని రాఘవులు అన్నారు. ఆర్టీసీ సంస్థను ప్రవేటీకరిద్దామని ,ఆస్తులను వేరేవారికి ధారాదత్తం చేద్దామని ప్రభుత్వం భావిస్తే పతనం తప్పదన్నారు. అలాంటి చర్యలు ఉపసంహరించుకోవాలని తెలిపారు. సీఎం భావిస్తున్నట్లు ఆర్టీసీపై ప్రజల మద్దతు లేదనడంలో వాస్తవం లేదని రాఘవులు అన్నారు. ఆర్టీసీ అన్నా, ఎర్ర బస్సు అన్నా ప్రజలకు ఎంతో ప్రేమ అని చెప్పారు. ఉద్యోగులు ఎవరు ఆత్మహత్య లకు పాల్పడవద్దని, వారి కుటుంబాలకు తాము అండగా ఉంటామని రాఘవులు తెలిపారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం వామ పక్షాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నామని రాఘవులు తెలిపారు. అన్నారు. అనంతరం తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ఆర్టీసీ సమ్మె ఉధృతంగా కొనసాగుతుందని, చరిత్రలోనే లేని విధంగా అత్యధిక సంఖ్యలో సూపరవైజర్లు కూడా సమ్మె లో పాల్గొంటున్నారని అన్నారు. సెల్ఫ్ డిస్మిస్ పేరుతో 48వేల మంది తొలగిపోయారు అనే ప్రకటనల వల్లే ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. చనిపోయిన ఇద్దరు కార్మికులు కూడా మరణ వాంగ్మూలం ఇచ్చారని, ప్రభుత్వం వల్లే తాము బలిదానం చేసుకున్నామని చెప్పారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉద్యోగ భద్రత, రిటైర్ అయిన తర్వాత పెన్షన్ కావాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారన్నారు. వామపక్ష ప్రభుత్వాలు ఇవన్నీ అమలు చేశాయని తమ్మినేని అన్నారు. 19 బంద్ కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అన్నారు. వామపక్ష పార్టీలు ఒకరోజు నిరాహారదీక్ష లు చేయాలని చూస్తున్నాయన్నారు. రేపు దేశవ్యాప్త ఆందోళనలో వామపక్ష పార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు తమ్మినేని. హుజూర్ నగర్ లో సీపీఐ ఎవరికి మద్దతు ఇస్తుందనేది చెప్పలేదని, తాము మద్దతు ఇచ్చిన వారికే మద్దతు ఇచ్చి వామపక్షాలు ఒక్కతాటి మీద ఉన్నాయని నిరూపించాలన్నారు.

మరింత ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

11వరోజూ తగ్గని ఆందోళనలు
హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన గవర్నర్ తమిళిసై
కెకెతో చర్చించిన మాజీ ఎంపి కొండా
సమ్మెపై చర్చిస్తాననలేదన్న కెకె
ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు
ఎంపి బండి సంజయ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డిల అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్15 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో టీఎస్ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చింది. 11వ రోజు కార్మికుల ఆందోళనలతో దద్దరిల్లింది. సమ్మకు మద్దుగా నిలిచన ప్రజాప్రతినిధులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్కడికక్కడ పోలీసులతో ఆందోళనలను అణిచివేసే కార్యక్రమానలు ప్రభుత్వం చేపట్టింది. మరోవైపు తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. ఈ నేపథ్యం లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై హూటా హుటిన మంగళవారం ఢిల్లీకి బయల్దేరారు. ఈ క్రమంలోనే ఢిల్లీకి రావాలంటూ గవర్నర్‌కు కేంద్రం నుంచి పిలుపు వచ్చింది. ఆర్టీసీ సమ్మెపై కేంద్రం నివేదికను కోరింది. మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ,కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తమిళిసై భేటీ కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలను గవర్నర్ వారికి వివరించనున్నారు. అయితే తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చి, ముగ్గురు ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు కార్మికులు కానీ ఒక్క మెట్టు కూడా దిగడంలేదు. దీంతో పాఠశాలలు, కళాశాలలు కూడా మూతపడ్డాయి. ప్రభుత్వ మొడి వైఖరి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమ్మెతో పలు జిల్లాల్లో కార్మి కులు మానవహారాలు, ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆర్టీసీకి మద్దతుగా చేపట్టిన బీజేపీ ర్యాలీలో పెద్ద ఎత్తున ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో ఎంపీ బండి సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కారుకు అడ్డంగా బీజేపీ కార్యకర్తలు పడుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వం తీరు పట్ల ఆర్టీసీ కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్మికులు మంత్రులకు పిండప్రదానం చేశారు. ఆర్టీసీ కార్మికుల బలిదానాలకు మంత్రులే కారణమంటూ.. మంత్రుల ఫోటోల ముందు ఏడుస్తూ మహిళల నిరసన తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకురాలు బోడిగ శోభ మద్దతు తెలిపారు.

ఆర్టీసీ సమ్మె ప్రభావంతో మంత్రుల బంగ్లాల వద్ద హై అలర్ట్ ప్రకటించారు. ఎటువైపు నుంచి అయినా కార్మికులు చొరబడతారన్న సమాచారంతో బంగ్లాల వద్ద 30-50 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్మికులకు మద్దతుగా విద్యార్థులు నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ డౌన్‌డౌన్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. నల్లగొండ బస్టాండ్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. నల్లగొండ డిపోను ఆర్టీసి కార్మికులు, ప్రజాసంఘాల నేతలు ముట్టడించారు. బస్సులు కదలకుండా కార్మికులు అడ్డంగా పడుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. దీంతో పంద మంది కార్మికులు, నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలావుంటే ఆర్టీసీ సమ్మెపై తాను చర్చిస్తానని అనలేదని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు అన్నారు. ప్రభుత్వం ఆదేశిస్తే చర్చిస్తానని అన్నానని అన్నారు. ఆర్టీసీ సమ్మెతో పరిస్థితులు చేజారుతున్నాయని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంతో తాను చర్చలు జరుపుతానని చెప్పలేదన్నారు. మంచి జరుగుతుందని అనుకుంటే మధ్యవర్తిత్వానికి తాను సిద్ధమన్నారు. చర్చలు జరిపేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదని, సీఎం కేసీఆర్‌తో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నానని.. ఆయన అందుబాటులోకి రాలేదని చెప్పారు. ప్రభుత్వం ఉద్దేశమేంటో తనకు తెలియదన్నారు. ఉద్యోగ సంఘాలు కొట్టుకోకుండా కలిసికట్టుగా ఉండాలని కేకే సూచించారు. మరోవైపు చర్చలకు ముందుకు రావాలని కెకెకు మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. సమ్మెతో ప్రజలకు తీవ్రిబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఇకపోతే ఆందోళనకు మద్దతుగా నిలిచిన సంగారెడ్డి ఎమ్మెల్యేజగ్గారెడ్డిని పోలీసులు అరెస్ట చేశారు. వివిధ జిల్లాల్లో కుటుంబాలతో సహా కార్మికులు నోడ్టెక్కారు. వారంతా సిఎం కెసిఆర్‌ను విమర్శిస్తూ నినాదాలు చేశారు.

తెలంగాణ విద్యావేదిక అధ్యక్షులు మద్దిలేటి అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్15 (ఆర్ఎన్ఎ): తెలంగాణ విద్యావేదిక, ప్రజాఫ్రంట్‌కు చెందిన ఇద్దరు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో తెలంగాణ విద్యావేదిక అధ్యక్షులు మద్దిలేటి, ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షుడు కృష్ణ ఉన్నారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారనే ఆరోపణలతో వారిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. వారిని బాగ్‌లింగంపల్లిలో అరెస్టు చేసిన పోలీసులు గద్వాలకు తరలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. ఈ రెండు సంస్థలు మావోల ముసుగు సంస్థలని పోలీసులు ఇప్పటికే ప్రకటించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్ , అక్టోబర్ 15: అన్ని జిల్లాల కలెక్టర్లతో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ తీరును మంత్రి కేటీఆర్ సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణపై వారం రోజుల్లో ప్రణాళిక రూపొందించి పురపాలక శాఖకు ఇవ్వాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాల మేరకు పారిశుద్ధ్య సిబ్బంది, వాహనాలు ఉండాలి. పురపాలక సిబ్బందికి కూడా ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలి. డంపింగ్ యార్డుల కోసం వెంటనే భూసేకరణ చేపట్టాలి. నగరాల్లో మరిన్ని షీ-టాయిలెట్లను నిర్మించాలని మంత్రి కేటీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కేంద్రమంత్రి చౌబేపై ఇంకుదాడి

పాట్నా,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): కేంద్ర సహాయ మంత్రి అశ్విని చౌబేపై గుర్తు తెలియని ఓ యువకుడు ఇంకు చల్లాడు. ఈ ఘటన పాట్నా మెడికల్ కాలేజీ ఆస్పత్రి వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అశ్విని చౌబే.. డెంగీ రోగులను పరామర్శించేందుకు, వారి ఆరోగ్య వివరాలను తెలుసుకునేందుకు పాట్నా మెడికల్ కాలేజీకి వెళ్లారు.

రోగులను పరామర్శించిన అనంతరం కేంద్ర మంత్రి తిరిగి వెళ్తున్న క్రమంలో ఆయనపై ఓ యువకుడు ఇంకు చల్లి పారిపోయాడు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఈ ఇంకు దాడి ప్రజలు, ప్రజాస్వామ్యంపైన దాడి చేయడమే అని పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం



కళా॥ పలురకేపుల పేరుములతో
పిలువను, విజయమును గూర్చు విజ్ఞులతో
ప్రజల జీవితములయందున
వెలుగుల జిలుగులు చిలకె... నవీన్ పట్నాయక్!!

(అక్టోబర్ 16 నవీన్ పట్నాయక్ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

ఆర్థిక భద్రత అత్యవసరం..

నేటినిజం
బుధవారం 16-10-2019

భారతదేశంలో వ్యవసాయం ఎపుడూ సంక్లిష్టస్థితినే ఎదురు చూస్తోంది. అదీ ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ఎవ్వరూ లేనంతటి సంక్లిష్టస్థితిని ఇపుడు ఎదుర్కుంటోంది. ఆరో దశకంలో తీవ్ర కరువు కాటకాలు ఏర్పడి ఆహారభద్రత ప్రమాదంలో పడినప్పటికీ లాల్ బహదూర్‌శాస్త్రి సమర్థ నాయకత్వంలో రైతన్నలు ఈ దురవస్థనుండి దేశాన్ని గట్టెక్కించగలిగారు. జాతీయ ఆహార భద్రత చట్టం తెచ్చేందుకు కేంద్రప్రభుత్వం కనబరుస్తున్న చొరవ హర్షణీయమయినదే! ముసాయిదా చట్టం ప్రకారం దేశ జనాభాలో దాదాపు 75 శాతానికి సబ్సిడీ ధరలపై బియ్యం, గోధుమలు సరఫరా చేయాలన్నది లక్ష్యం. ఈ చట్టంద్వారా ప్రజలకు ఆహార భద్రత చట్టం అమలుకు వీలుగా వ్యవసాయోత్పత్తి వ్యవస్థను పటిష్టీకరించడంపై ముసాయిదా మౌనంగా ఉండిపోయింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరిచేదెలాగన్న దానిపైన అందులో ఏలాంటి ప్రస్తావనలేదు. ప్రస్తుత దారుణ దురవస్థే కొనసాగితే రైతులు భవిష్యత్తులో వ్యవసాయం కొనసాగిస్తారా? లాభసాటికానీ వ్యవసాయానికి వారు దూరమయితే సుస్థిర ఆహారోత్పత్తి ఎలా సాధ్యం? తగినంత ఆహారమే అందుబాటులో లేనపుడు ఆహారభద్రత చట్టాన్ని ఏ విధంగా అమలు చేస్తారు? ఆహారోత్పత్తులు పెంచడానికి రైతులకు ఆర్థిక భద్రత అత్యవసరం. రైతుల ఆర్థిక స్థితిగతులు గత రెండు దశాబ్దాలలో కొంత వరకు మెరుగుపడినప్పటికీ వ్యవసాయే తర రంగాల్లోని ఉద్యోగులతో పోల్చినపుడు వారి జీవన ప్రమాణాలు ఏమీ బాగుపడలేదు. పదకొండో ప్రణాళిక కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ వారి తీరులో మార్పులేదు. అందుకు కారణాలు చాలా ఉన్నాయి. భారతీయ వ్యవసాయ రంగంపై ప్రపంచీకరణ తీవ్ర దుష్ప్రభావం చూపుతోంది. తొమ్మిదోదశకం ఆరంభంలో ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినపుడు ఈ గండం నుండి గట్టెక్కే ఉద్దేశంతో హఠాత్తుగా దేశంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టారు. ఆ చర్య దేవాన్ని దారుణంగా దెబ్బతీసింది. తొలుత పరిపాలన, సంస్థాగత సంస్కరణలు చేపట్టి తర్వాత ఆర్థిక సంస్కరణల దిశగా ముందడుగు వేసి ఉండాల్సింది. అలాంటి సన్నద్ధత లేకుండా ఆర్థిక రంగంలోకి ప్రపంచ శక్తుల్ని ఆహ్వానించడం అనర్థకారమయింది. చైనా 1978 అంతర్గత సంస్కరణల ప్రక్రియ ప్రారంభించింది. పరిపాలన, సంస్థాగత సంస్కరణలు లేకుండా ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడం, ప్రైవేటీకరణకు స్వాగతం పలకడం ఏరికోరి సమస్యలు తెచ్చిపెట్టుకోవడమే మనకు అనుభవపూర్వకంగా తెలిసి వచ్చిన వాస్తవమిది. వ్యవసాయ రంగంలో పూర్తిగా ఏకపక్ష సంస్కరణలు చేపట్టారు. పైగా అవి పరిశ్రమలకు మేలు చేసేవి. కార్పొరేట్ రంగం ఒత్తిళ్లకు లొంగి వ్యవసాయ ఉత్పాదక రంగాన్ని మాత్రం సరళీకరించారు. ఆ ఉత్పాదకాల ధరలు, నాణ్యతపై ఏలాంటి నియంత్రణలు ఏర్పాటుచేయలేదు. అయినా ప్రపంచం ఆర్థికంగా మునిగిపోతున్నా, ఇండియా నిలదొక్కుకుంటోందనే చెప్పాలి. ప్రభుత్వం వ్యవసాయం విద్య ఆరోగ్య రంగాలపై పెట్టుబడులు పెంచడంతోపాటు ధాన్యం అంతరాష్ట్ర రవాణాపై నియంత్రణలు ఎత్తివేయాలి. పంటల ఎగుమతులపై నిషేదం ఎత్తివేస్తే మరింత కోలుకోవచ్చు!!

వ్యాపారులను కలవరపెడుతున్న బంగారం ధరలు

భారీగా అమ్మకాలు తగ్గాయని ఆందోళన

న్యూఢిల్లీ,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): బంగారం ధరలు ఈ మధ్య ఎంతగా కలవరపెట్టినా కొనుగోళ్లు భారీగా పడిపోయాయని ఆభరణ్యాల వ్యాపారులు వాపోతున్నారు. గతంతో పోలిస్తే అమ్మకాలు భారీగా మందగించాయి. ప్రజల్లో బంగారం ధరలపై తీవ్ర వ్యతిరేకత వస్తోందిన అంటున్నారు. దీనికితోడు వరుసగా ధరలు పెరుగతూ కొనుగోలు శక్తికి మించి దాటిపోవడం వ్యాపారస్తులను కూడా కలవరపరుస్తోంది. ఈ దశలో ధరలు మళ్ళి భారీగా తగ్గాయి. ఇటీవల మరో రోజు పెరుగుతూ వస్తున్న బంగారం స్వల్పంగా తగ్గింది. అయితే వెండి ధర మాత్రం మళ్ళి పెరిగింది. బంగారం పెరిగితే, వెండి తగ్గటం.. వెండి పెరిగితే బంగారం తగ్గటం బాగా అలవాటు అయ్యింది. హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.70 తగ్గుదలతో రూ.39,710కు చేరింది. ఈ నేపథ్యంలోనే 10 గ్రాముల 22 కార్యెట్ల బంగార ధర రూ.50 తగ్గి రూ.36,380 వద్దకు చేరింది. బంగారం ధర తగ్గిన వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. కేజీ వెండి ధరలో రూ100 పెరుగుదలతో రూ.48,650కు చేరింది. ఢిల్లీ మార్కెట్‌లో బంగారం ధర స్వల్పంగా పెరిగింది. పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.140 పెరుగుదలతో రూ.38,400కు చేరింది. అదేసమయంలో 10 గ్రాములు 22 క్యారెట్ల బంగారం ధర రూ.10 తగ్గుదలతో రూ.37,200కు క్షీణించింది. కాగా విజయవాడ, విశాఖపట్నంలో కూడా ధరలు ఇలానే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర కాస్త పెరిగింది అనే చెప్పాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో 1,498.65 డాలర్ల పెరుగుదలతో ఔన్స 0.13 శాతం పెరిగింది. ఏది ఏమైనా ఈరోజు బంగారం ధర తగ్గడం పసిడి ప్రియులకు ఊరటనిస్తోంది.

ఆర్టీసీ కార్మికుల శవాలతో రాజకీయాలా?

ఉద్యమంలో లబ్ది పొంది ఇప్పుడు వారిని ద్రోహులంటారా?

మండిపడ్డ సిపిఐ నేత

ఆదిలాబాద్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల శవాలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని, వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఐ నేతలు సూచించారు. కేసీఆర్ సమ్మెతో లబ్ది పొందాలన ఇచూస్తే అగ్గికాక తప్పదని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల ఆగ్రహానికి గురికావద్దని సీపీఐ జిల్లా నాయకులు కలవేన శంకర్ అన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసిని, ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా బస్సులను నడపాలని చూస్తే కార్మికులు ఊరుకోరని, వాటిని అగ్గికి ఆహూతి చేస్తారని అన్నారు. ప్రజా ఉద్యమం ముందు నిజాం నవాబే తలవంచక తప్పలేదని, కేసీఆర్ ఎంత అని వ్యాఖ్యానించారు. ప్రజా ఉద్యమంతోనే తెలంగాణ వచ్చిందని, కూడా కెసిఆర్ గ్రహించాలన్నారు. ఏపీలో ఆర్టీసీని విలీనం చేశారని, అక్కడ లేని అభ్యంతరం ఇక్కడెందుకన్నారు. ఆర్టీసీ కార్మికులకు టీఎన్జీవోలు మద్దతు ఇవ్వాలని, అలా ఇవ్వకపోతే భవిష్యత్తులో టీఎన్జీవోలకు కష్టం వస్తే మద్దతు ఎవరూ ఇవ్వరని హెచ్చరించారు. ఆర్టీసీ సమ్మెకు ముందే ప్రైవేటు వాళ్లతో కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేశారని, అందువల్లే ఆర్టీసీ విలీనం విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నారని సీపీఐ నేత ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు కాని ఆర్టీసీ కార్మికులను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఎవరబ్బ సొమ్మని ఆర్టీసీని 50 శాతం ప్రైవేటీకరిస్తారని మండిపడ్డారు. ఆర్టీసీ విషయంలో తెలంగాణ ఉద్యమంలో లబ్దిపొంది ఇప్పుడు వారిని ద్రోహులుగా చూడడం తగదని,సీఎం కేసీఆర్ తన వైఖరి మార్చుకోవాలని అన్నారు.

తక్షణం ఆర్టీసీ సమ్మెపై స్పందించాలి: బిజెపి

మెదక్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి మొండి పట్టుదలకు పోకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీర్చి, సమ్మె పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బిజెపి అధికరా ప్రతినిధి రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన సిఎం కెసిఆర్ సమ్మెను ఎగదోసేలా మాట్లాడడం సరికాదన్నారు. ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా నిలిచి పోరాడుతున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె 11వ రోజుకు చేరుకుంది. అటు ప్రభుత్వం, ఇటు కార్మికులు పట్టు వీడడం లేదు. దీంతో పరిష్కారం కనుచూపు మేరలో కనిపించడం లేదు. మహిళా ఆర్టీసీ కార్మికులపై జరిగిన దాడులకు కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కేసీఆర్ కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన సాగుతోందన్నారు. గతంలో ఉద్యోగ సంఘాల నాయకుడిగా చెలామణి అయిన శ్రీనివాస్ గౌడ్ నేడు మంత్రి పదవి రాగానే.. ఉద్యోగ సంఘాలను ఆర్టీసీ సంఘాలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టించి కార్మిక సంఘాలలో చీలిక తేవడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. మీ మంత్రి పదవుల కోసం కార్మిక సంఘాల భవిష్యత్తును నాశనం చేయకండి. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

పేలవంగా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, అక్టోబర్ 15:మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రచారంలో ముందుండగా కాంగ్రెస్ ప్రచారం పేలవంగా సాగుతోంది. పార్టీకి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేని కారణంగా కాంగ్రెస్ పార్టీ అతలాకుతలం అవుతోంది. ఇటీవల ఆ పార్టీ సీనియన్నేతలు సల్మాన్ ఖుర్షీద్, జ్యోతిరాదిత్య సింధియాలు చేసిన వ్యాఖ్యలు పార్టీ దౌర్భాగ్య పరిస్థితిని సూచించాయి. కాంగ్రెస్ పార్టీ సమర్థుడైన నేతను ఎన్నుకోలేని దుస్థితిలో ఉంది. పివి నర్సింహారావు లాంటి దార్శనికుడు ఆ పార్టీకి అవసరం. అయితే అలాంటి నేతలను కాంగ్రెస్ దగ్గరకు రానీయదని చరిత్ర చెబుతోంది. కుటుంబ పాలనలో మగ్గిన పార్టీకి ఇవి ఎంతమాత్రం ఆమోద యోగ్యం కావు. దీనికితోడు వారికి ప్రచారాస్త్రం కూడా లేకుండా పోయింది. అందుకే రాహుల్ ఈ రెండు రాష్ట్రాల్లో కేవలం నిరుద్యోగ సమస్యను ఎత్తుకున్నారు. అయితే అమిత్‌షా, మోడీల ముందు ఆయన ప్రచారం పేలవంగా సాగుతోంది. ఇక మోడీ,అమిత్‌షాలు మాత్రం తమ బ్రహ్మాస్త్రం 370 ఆర్టికల్ రద్దును ప్రచారాస్త్రంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ప్రజల్లో కూడా అదే బాగా పనిచేస్తోంది. అందుకే ప్రధాని మోడీ కూడా దీనిని వెనక్కి తీసుకుని వచ్చే దమ్ముందా అని సవాళ్లు విసిరారు. దేశాన్ని ఆరు దశాబ్దాల పాటు ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అవినీతి కుంభకోణాలు, వ్యవస్థల పతనాలు, పేదరికం పెచ్చరిల్లిపోవడం, అభివృద్ధి కుంటుపడడం, నిరుద్యోగం పెరిగిపోవడం మొదలైనవన్నీ ప్రజలను కలచి వేశాయి. ఈ సమస్యలు ఇప్పటికప్పుడు మోడీ ప్రధాని కావడంతో పుట్టుకుని వచ్చినవి కావు. ఇన్నేళ్ల కాంగ్రెస్ పాలనలో సర్వదరిద్రాలు పుట్టుకుని వచ్చాయి. వీటితో పాటు కుటుంబపాలన, నేతల వంధి మాగధత్వం తారస్థాయికి చేరుకోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను అసహ్యించుకునే పాలనకు వారిని దూరంగా పెట్టారు. కాంగ్రెస్ నేతల కుహనా లౌకిక వాదం, కశ్మీర్ వంటి సమస్యల పట్ల వారి విచ్ఛిన్నకర రాజకీయాలు, మైనారిటీ బుజ్జగింపు వైఖరితో ఇంతకాలం జనం విసిగిపోయారు. అందుకే వరుసగా మోడీకి పట్టం గట్టారు. మోదీ నిజాయితీని కూడా ప్రజలు శంకించడం లేదు. మరీ ముఖ్యంగా 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తల్లాక్ వంటి చర్యలు మోడీని నమ్మకమైన నేతగా నిలిపాయి. ఉగ్రవాదుల నిర్మూలనకూ చేపడుతున్న చర్యలతో ప్రజల్లో ఆయన పట్ల అభిమానం పెరిగింది. ఇక రెండోసారి అధికారంలోకివచ్చిన తరువాత కశ్మీర్ సమస్య పరిష్కారానికీ, పాకిస్థాన్ ఆగడాలను అరికట్టేందుకు చేపట్టిన చర్యలతో ప్రజల దృష్టిలో మోదీ అత్యున్నత నేతగా ఎదిగారు. ఇకపోతే అంతర్జాతీయ నేతగా మోదీకి గుర్తింపు లభించింది. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ గ్రామస్థాయిలో కూడా అస్తిత్వం కోసం పోరాడవలిసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెలలోనే జరగనున్న మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తిరుగులేని విధంగా దూసుకుని పోతుంది. ప్రజలు మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి అధికారం అప్పగిస్తారన్న ధీమాలో కమల నాథులు ఉన్నారు. ఒకప్పుడు భారీ మెజారిటీతో ఈ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు మల్లగుల్లాలు పడుతోంది. మహారాష్ట్రలో యువకుడైన దేవేంద్ర ఫడ్నవీస్ సమర్థమైన పాలనను అందించడం తో ఆశించిన ఫలితాలు సాధించగలిగారు. దీంతో లోక్ సభ ఎన్నికల్లో కూడా బిజెపి, శివసేన తిరుగులేని విజయాన్ని సాధించాయి. పోటీ చేసిన 25 స్థానాల్లో బిజెపి 23 సీట్లు గెలుచుకోగా, శివసేన 18 సీట్లు సాధించింది. మరోవైపు అసెంబ్లీకి, లోక్‌సభకూ మధ్య కాంగ్రెస్, ఎన్‌సిపి కూటమి బలం మరింత క్షీణించింది. అలాగే మర్యానాలో కూడా బిజెపికి గట్టి పోటీనీయగలిగిన పరిస్థితి ఏ పార్టీకీ లేదు. ఇక్కడ కూడా 2014లో బిజెపి ఘన విజయం తర్వాత పాత సంప్రదాయాలను త్రోసిపుచ్చి ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయిన మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. మోదీ ప్రభంజనంలో 2014లో బిజెపి నాలుగు సీట్లనుంచి 47 అసెంబ్లీ సీట్లు సాధించింది. ఇక్కడ ఎన్నో దశాబ్దాల పాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పూర్తిగా అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా కాంగ్రెస్ చివరి ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హూడా పెద్ద ఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడడం, సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు అప్పనంగా వేల కోట్ల విలువైన భూములను అప్పగించడంతో ఆ పార్టీని ప్రజలు గద్దెదించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో యథా ప్రకారం కుమ్ములాటలు తీవ్రమయ్యాయి. పార్టీ మాజీ పిసిసి అధ్యక్షుడు అశోక్ తన్వర్ సోనియా గాంధీ నివాసం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించాల్సివచ్చిందంటేనే ఆ పార్టీ ఎంత దుస్థితిలో ఉన్నదో అర్థమవుతోంది. మరో వైపు ఖట్టర్ హర్యానాలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతిభగల వేలాది యువకులకు ఉపాధి కల్పించారు. ఆయన హయాంలో రహదారి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రజాధనాన్ని దోచుకోవడం, కుటుంబ పాలనను ప్రవేశ పెట్టడం, అరాచక పాలనను కొనసాగించడం, నిత్యం రాజకీయాలకు పాల్పడడం వల్లే తాము ప్రజలకు దూరమయ్యామన్న సత్యాన్ని కాంగ్రెస్ గుర్తించడం లేదు. ఇన్నేళ్ల పాపాలకు బిజెపిని దోషిగా చూపడం కూడా కాంగ్రెస్ చేస్తున్న అతిపెద్ద తప్పు. ఇవేవీ పట్టించుకోకుండ ఆ అదే పనిగా మోడీని విమర్శించడం కూడా కాంగ్రెస్‌కు మైనస్‌గా మారుతోంది. మొత్తంగా ప్రచారంలో పేలవంగా సాగుతోంది. ప్రజలు కూడా కాంగ్రెస్ ప్రచారాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. మోడీ, అమిత్‌షాల ప్రచారం సవాళ్ల ముందు రాహుల్ తేలిపోతున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో అస్త్ర సన్యాసం చేసిన నేతగా రాహుల్ ప్రజల్లో మిగిలిపోయారు.

హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై ఆర్టీసీ సమ్మె ప్రభావం

17న కెసిఆర్ సభపై సర్వత్రా ఉత్కంఠ

ఉప ఎన్నిక విజయం కోసం గులాబీ నేతల మల్లగుల్లాలు

నల్లగొండ,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): హుజూర్ నగర్ ఉప ఎన్నిక ప్రచారంలో అధికార టిఆర్ఎస్‌కు అంత అనుకూల పరిస్థితి లేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఆర్టీసీ సమ్మెపై అనుసరిస్తున్న మొడి వైఖరి కారణంగా ప్రజల్లో తీవ్రనిరసన వ్యక్తం అవుతోంది. అయితే అధికరా గులాబీ నేతలు ఇప్పటికే భారీగా డబ్బు వెదజల్లుతూ ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలో 17న సిఎం కెసిఆర్ ప్రచార సభ ఎలా ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఇక్కడ ఎన్నికల అధికారులు మారువేశాల్లో అభ్యర్థుల ఖర్చును మదింపుచేస్తున్నారు. దీంతో టిఆర్ఎస్‌కే ఎక్కువ నష్టం అన్నప్రచారం ఉంది. మొత్తంగా ఇప్పుడు ఈ ఎన్నిక అధికార పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారింది. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడి నుంచి గెలిచిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఈసారి తన భార్యను గెలిపించుకుని పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అధికార పార్టీ అయి ఉండి ఉప ఎన్నికల్లో ఓడితే అది రాజకీయంగా టిఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ. అందుకే టీఆర్ఎస్ సర్వశక్తులూ ఒడ్డుతోంది. అందుకే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని.. మొదటిసారిగా సీపీఐ మద్దతు అడిగింది. అందుకు ఎర్రన్నలూ మొదట సరే అన్నారు. కానీ ఆర్టీసీ సమ్మెతో సీన్ ఒక్కసారిగా మారిపోయింది. సమ్మెపై సర్కారు తీరును నిరసిస్తూ సీపీఐ మద్దతు ఉపసంహరించుకుంది.. దీంతో రాజకీయం రసకందాయంలో పడింది. అసలే కాంగ్రెస్ నియోజకవర్గం.. అందులోనూ ఆర్టీసీ సమ్మెతో ప్రభుత్వ వ్యతిరేక గాలి కనిపిస్తోంది. ఈ ఎన్నిక ఎక్కడ కొంప ముంచుతుందో అన్న ఆందోళన టీఆర్ఎస్ లో కనిపిస్తోంది. గెలుపు నల్లేరుపై నడకే అని మొదట భావించిన టీఆర్ఎ , కాంగ్రెస్ మారిన పరిస్థితులు.. మారుతున్న సమీకరణలతో సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించడంతో ఆర్భాటపు ప్రచారం జోలికి పోవడంలేదు. ఇంకా ప్రచారానికి మూడురోజుల గడువే మిగిలి ఉంది. అయితే ప్రచరాం మాత్రం పెద్దగా కనిపించడం లేదు. అక్కడక్కడ తిరిగే ప్రచార వాహనాలు మినహా అనలు ఎన్నికలు జరుగుతున్నట్లే లేదు. ఊరూవాడా రెపరెపలాడే జెండాల స్థానంలో అక్కడక్కడ ఒకటి రెండు జెండాలు మాత్రమే కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినా.. ఆ తర్వాత జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తిరుగులేని అధిక్యాన్ని సాధించిన టీఆర్ఎస్ సాధించింది. కాంగ్రెస్ కూడా శాసనసభ ఎన్నికల్లో 7,466 ఓట్ల ఆధిక్యంతో నెగ్గిన ఉత్తమ్ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 12,993 ఆధిక్యాన్ని సాధించడంతో గెలుపుపై విశ్వాసంతో ఉంది. మరోవైపు బిజెపి కూడా ప్రచారంలో దూసుకుని పోతున్నారు. గెలిచేంతగా కాపోయినా అధికార పార్టీని ముప్పుతిప్పలు పెట్టే స్థాయిలో వారు దూసుకుపోతున్నారు. దీంతో టిఆర్ఎస్‌కు ఈ ఉప ఎన్నిక అంత ఈజీ కాదని అర్థం అవుతోంది. కెసిఆర్ ప్రచారంతో ప్రజలు ఏ మేరకు సప్పందిస్తారన్నది చూడాలి.

మహా ఎన్నికలతో మావోల కదలికలపై నజర్

సరిహద్దు జిల్లాల్లో కూంబింగ్

గ్రామాల్లో జల్లెడ పడుతున్న పోలీసులు

భూపాలపల్లి,అక్టోబర్15 (ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ఎన్ఇనకలతో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు మావోల కూంబింగ్చేపట్టారు. దీంతో వీరు సిరహద్దులో ఉన్న తెలంగాణకు వచ్చే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. జిల్లాలో మావోయిస్టులు పట్టు కోసం ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో పోలీసులు ప్రాజెక్టుల వద్ద భద్రతను మరింతగా పెంచారు. మహారాష్ట్రలో ఈనెల 21న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో అక్కడ పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉండడంతో మావోలు ఇటుగా గోదావరి దాటినట్లు ప్రచారం జరుగుతోంది. మారుమూల మండలం పలిమెల, మహాముత్తారం గ్రామాల్లో మాత్రం అటవీ ప్రాంతం కావడంతో జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దు కావడంతో మావోలు అటుగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో గ్రామాల్లోని చోటమోట నాయకులతో పాటు మాజీ మావోయిస్టులు మండల కేంద్రంతో పాటు పట్టణాల్లో తలదాచుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే పోలీసులు కరపత్రాల విషయంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది. మావోల కరపత్రాలు అసలా, నకిలివా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్నందున జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు తెలంగాణ వైపున ఉన్న మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం మండలాల్లో గోదావరి దాటి జిల్లాలోకి ప్రవేశించకుండా అప్రమత్తమయ్యారు. రాత్రి, పగలు కూంబింగ్, చెకింగ్ నిర్వహిసున్నారు. మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకుల కదలికలపై కూడా పోలీసులు నజర్ వేసినట్లు తెలిసింది. ప్రాజెక్టులు నిర్మిస్తున్న ప్రాంతాల్లో అనుమానితులు కనిపిస్తే విచారించి వివరాలు ఆరా తీస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. పలు గ్రామాల్లో ఇటీవల మావోయిస్టుల కరపత్రాలు వెలిశాయి. దీంతో జిల్లా పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన, మేడిగడ్డ బ్యారేజీ వంతెనల పైనుండి మ్దహారాష్ట్ర తెలంగాణకు వస్తున్న వాహనాలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం మండలాల్లోని అడవుల్లో నిరంతరం పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మహదేవపూర్ మండలంలోని ఓడ రేవులపై పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించినట్లు తెలిసింది. మరోపక్క వర్షాకాలం గోదావరిలో ప్రవాహం ఎక్కువగా ఉండనుండడంతో రోడ్డు మార్గాలపైన పోలీసులు నజర్ వేశారు.

పలువురు రాజకీయనాయకులపైన మావోయిస్టుల కరపత్రాలు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ప్లలెల్లో ఆందోళన చోటు చేసుకుంటుంది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సీఆర్‌పిఎఫ్, డిస్ట్రిక్ గార్డ్స్, సివిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోలు తెలంగాణ వైపు రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో కౌలురైతులకు అన్యాయం

ధరణి వెబ్‌సైట్‌లో పేర్లు లేకపోవడంతో తకరారు

కొనుగోళ్లను పర్యవేక్షించనున్న కమిటీ

కరీంనగర్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోళ్లలో గతంలో తలెత్తిన సమస్యలను అధిగమించేందుకు ప్రస్తుత సీజన్ నుంచి కొత్త నిబంధనల అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారు. ధాన్యం రవాణా, పర్యవేక్షణ, కనీస మద్దతు ధర, వివిధ శాఖల సమన్వయం కోసం ఈ కమిటీ పనిచేస్తుంది. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీలో జిల్లా పోలీస్ కమిషనర్, జిల్లా లేబర్ ఆఫీసరు, లీడ్‌బ్యాంకు మేనేజరు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధం అయ్యారు. ధాన్యం కొనుగోళ్లలోని కొత్త నిబంధనలతో కౌలురైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమి తోపాటు ఇతర భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. కౌలురైతులు పండించిన ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చినప్పుడు అసలైన రైతుల వివరాలే ధరణి వెబ్‌సైట్‌లో ఉంటాయి. ఈ రైతుల పేరిటనే ధాన్యం విక్రయించడంతోపాటు డబ్బులు సైతం వారి బ్యాంకు ఖాతాల్లోనే జమయ్యే అవకాశం ఉండడంతో కౌలురైతులు కేంద్రాలకు వచ్చేందుకు వెనుకంజ వేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. అయితే తమకు న్యాయంచేయాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యను ఎల ఆపరిష్కరిస్తారన్నది తేలాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం సేకరణకు ఐకేపీ, ప్రాథమిక సహకార సంఘాలు, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో మొత్తం 170 కొనుగోలు కేంద్రాలను ఈ నెలాఖరు వరకు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో 104, ఐకేపీ 50, డీసీఎంస్ 15, మెప్మా ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోళ్లలో కీలకపాత్ర పోషించిన వీఆర్‌వోలను తప్పించి కొత్తగా ఏఈవోలకు బాధ్యతలు అప్పగించారు. గతంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లాలంటే ఆయా గ్రామాల వీఆర్‌వోలు సంబంధిత పంట ఎంత పండించారంటూ నిర్ధారణ చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ప్రస్తుతం ధరణి వెబ్‌సైట్‌ను సహకార సంఘాలు, ఐకేపీ సంఘాలకు లింకేజీ చేయడంతో సంబంధిత రైతుల వివరాలన్నింటిని ఏఈవ

ఆర్టీసీ సమ్మెపై కేసీఆర్ కుట్రపూరిత చర్య

కార్మికుల బలిదానాలపైనా నిర్లక్ష్యం
తెలంగాణ ఉద్యమంలో ఒకలా..ఇప్పుడోలా వ్యవహారం
మండిపడ్డ కాంగ్రెస్ నేత మృత్యుంజయం

కరీంనగర్,అక్టోబర్15(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం స్వార్థ పూరిత ఆలోచనతో ఆర్టీసీని నిర్వీర్యం చేసి, దాని ఆస్తులు కాజేయడానికి కుట్రపన్నుతోందని డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల బలిదానాలకు కూడా చలించని స్థితిలో సిఎం కెసిఆర్ ఉన్నారని మండిపడ్డారు. వారి ప్రాణాలతో ప్రభుత్వం చలగాటం ఆడుతోందని మంగళవారం నాడిక్కడ అన్నారు. ఇద్దరు ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వారి బలిదానాలకు ప్రభుత్వమే కారణమన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎంత జీతాలు పొందుతున్నారో కూడా తెలియని సీఎం ఉండడం దురదృష్టకరమన్నారు. ప్రతీ రోజూ కోటి మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చుతున్న ఉద్యోగులను తొలగిస్తామనడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రభుత్వం చెల్లించే బకాయిలు చెల్లిస్తే ఆర్టీసీకి నష్టాలే లేవని అన్నారు. రూ.1052 కోట్లు వాహనాల టాక్స్ కింద వసూలు చేసి ఆర్టీసీకి ఇవ్వాల్సిన సొమ్ము ఇవ్వకుండా దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఉద్దేశపూర్వకంగానే ఆర్టీసీ కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులతో పెట్టుకుంటే అగ్గితో పెట్టుకున్నట్లే అన్న కేసీఆర్..మరి ఇప్పుడు చేస్తుందేమిటని ధ్వజమెత్తారు. ఏపీలో కొత్తగా ఎన్నికయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని..కానీ తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రం ఆర్టీసీని ప్రైవేటు పరం చేయాలని కుట్రల పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఆర్టీసీ కార్మికులు జీతాలు లేకుంటే పండగ ఎలా జరుపుకుంటారని కూడా ఆలోచించలేదని నిలదీశారు. ఇదిలావుంటే సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె క్రమంగా ఉధృతమవుతోంది. కార్మికులకు ప్రజలు, పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు పెరుగుతోంది. ఆర్టీసీ సమ్మె మంగళవారానికి పదకొండో రోజుకు చేరుకుంది. ఇంతకాలం వేచి చూసిన కార్మికులు పోరాటాలను క్రమంగా ఉధృతం చేస్తున్నారు. జేఏసీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు ఉధృతంగా సాగుతున్నాయి. ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాల మద్దతుతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు బస్టాండ్ ఆవరణలోని డిపోల వద్ద ఆందోళన చేశారు. ఆర్టీసీలో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, ప్రభుత్వ ఇచ్చే రాయితీలు చెల్లించాలని, అన్ని రకాల ట్యాక్స్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఖండించారు.

నేటితో మద్యం దరఖాస్తులకు చివరి రోజు

భారీగా వస్తున్న టెండర్లు

జనగామ,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): మద్యం దరఖాస్తుల పక్రియ ఈనెల 16వ తేదీతో ముగియనుంది. దీంతో ఇప్పటికే జిల్లాలో మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తులు భారీగా వచ్చాయి. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2019 మద్యం దుకాణాల టెండర్లను అసక్తిగలవారు ఎవరైనా దరఖాస్తు చేసుకునేలా నిబంధనలు విధించారు. జిల్లాలోని 41 మద్యం దుకాణాలకు ఈనెల 9వ తేదీ నుంచి నూతన టెండర్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.రెండు లక్షల డీడీ లేదా చలాన్లు కట్టి టెండర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. టెండర్‌దారుల దరఖాస్తుల సీరియల్ ప్రకారం ఈనెల18న ఉదయం 11 గంటలకు లక్కీడ్రా ద్వారా ఎంపికచేయనున్నట్లు కలెక్టర్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. దరఖాస్తులను 16వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు క్యూలో ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని, 4 దాటిన తర్వాత ఎవరైనా వస్తే అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జిల్లాలోని 41 వైన్స్‌లకు 211 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అధికారి ఆర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. పాతవి కలిపితే మొత్తం 344 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

పట్టణ ప్రాంతాలను..
సుందరంగా తీర్చిదిద్దుకోవాలి

– అందుకే 30రోజుల పట్టణ ప్రణాళిక
– ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్ నగర్, అక్టోబర్15 (ఆర్ఎన్ఎ) : పట్టణ ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దుకోవాలని, దీనిలో భాగంగా 30 రోజుల పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చినట్లు ఎక్సైజ్, పర్యాటక, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్ పట్టణంలో 30రోజుల పట్టణ అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రోనాల్డ్ రాన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ పట్టణంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 30రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛధంగా ముందుకు వచ్చి తమ గ్రామాలను శుభ్రం చేసుకున్నారని అన్నారు. దీనికితోడు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడం ద్వారా గ్రామాల్లో అధికశాతం సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. సీఎం కేసీఆర్ గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని, దీనిలో భాగంగా తొలుత గ్రామ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించటం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికారులను గ్రామాల్లోకి రప్పించి అభివృద్ధి పనులు అక్కడికక్కడే నిర్వహించేలా చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. గ్రామ ప్రణాళిక విజయవంతం అయిన తరుణంలో మహబూబ్ నగర్ లో పట్టణ ప్రణాళిక ప్రారంభించామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రజలంతా తమతమ పరిధిలో వార్డులను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్తను రోడ్లపై, ఇండ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లో వేయవద్దని, తడిపొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ చెత్తబండ్లలో వేయాలన్నారు. దీంతోపాడు మీ పరిసరాల్లో అపరిశుభ్రత వాతావరణం ఉంటే వాటిని శుభ్రం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి వార్డుల్లో పర్యటించారు. 37వ వార్డు క్రిష్టియన్ కాలనీలో పాడుబడ్డ ఇండ్లను కూల్చేశారు. మురుగు కాలువలు, చెత్త వేయబడ్డ ప్రాంతాలను పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించి వెంటనే బాగుచేయలని అధికారులను మంత్రి ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు మరో మణిహారం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: తెలంగాణ రాజధాని హైదరాబాద్ చుట్టూ మరో ప్రాంతీయ రింగురోడ్డు నిర్మాణంతోపాటు రాష్ట్రంలోని వివిధ రోడ్ల కేటాయింపునకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా ఆంగీకరించారని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ప్రశాంత్ రెడ్డి సోమవారం నితిన్ గడ్కరీని కలుసుకుని రాష్ట్రానికి సంబంధించిన వివిధ రోడ్డు ప్రాజెక్టుల గురించి చర్చించారు. తాను చెప్పినదంతా సావకాశంగా విన్న గడ్కరీ పలు ప్రాజెక్టుల పట్ల సానుకూలత వ్యక్తం చేశారని చెప్పారు. రాష్ట్ర రాజధాని చుట్టూ ప్రస్తుతం ఉన్న రింగ్ రోడ్డు సరిపోవటం లేదు.. పెరుగుతున్న వాహనాల రాకపోకలను ఎదుర్కొనేందుకు ప్రాంతీయ రింగు రోడ్డును నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదన పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని ప్రశాంత్ రెడ్డి విలేఖరులకు చెప్పారు. దాదాపు మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యే ఐదారు రోడ్ల నిర్మాణం, నాలుగు నుండి ఆరు రోడ్లకు విస్తరించటం తదితర పనుల పట్ల గడ్కరీ సానుకూలత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. 44వ నంబర్ జాతీయ రహదారికి సంబందించి హైదారాబాదు-బెంగళూరు సెక్షన్‌లో 22.300 కిలోమీటర్ల నుండి 34.140 కిలోమీటర్ వరకు రూ.309కోట్ల వ్యయంతో జియో మెట్రిక్ అభివృద్ధి పనులు చేపట్టడం, నాగపూర్-హైదరాబాద్ సెక్షన్‌లో 454 నుండి 471 కిలోమీటరు వరకు రూ.706కోట్ల ఖర్చుతో జియో మెట్రిక్ అభివృద్ధి పనులు చేపట్టడం, 472 కిలోమీటర్ వద్ద గుండ్ల పోచంపల్లి నుండి 481 కిలోమీటర్ అంటే బోయిన్‌పల్లి వరకు రూ.447 కోట్ల వ్యయంతో నాలుగు లైన్లను ఆరు లైన్లు చేయటం పనుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా ఉన్నారని అన్నారు. భారత్‌మాల పథకం కింద అప్పా జంక్షన్ నుండి మనె?నగుడ వరకు, కోదాడ నుండి ఖమ్మం వరకు రోడ్డును నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయటం.. 161-బీబీ నంబర్ జాతీయ రహదారికి సంబంధించిన మిస్సింగ్ లింక్, బోధన్-రద్రూర్-మద్నూర్ వరకు రోడ్డును అభివృద్ధి చేయటం, జాతీయ రహదారి 161-ఏఏ కింద సంగారెడ్డి-నర్సాపూర్-తూప్రాన్-చౌటుప్పల్ ఓఆర్ఆర్ నిర్వహణకు నిధులు కేటాయించటం గురించి కేంద్ర మంత్రితో చర్చించినట్లు ప్రశాంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ చుట్టూ ప్రాంతీయ రింగురోడ్డు (రీజినల్ రింగ్ రోడ్) నిర్మాణానికి అనుమతి కోరినట్లు మంత్రి చెప్పారు.హైదరాబాద్- వలిగొండ- తొర్రూర్- మహబూబ్‌నగర్- ఎల్లందు, మెదక్-ఎల్లారెడ్డి-రుద్రూర్ వరకు, బోధన్-బానర-బైంసా వరకు, మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి వరకు, చౌటుపల్లి-షాద్‌నగర్-కంది వరకు గల రోడ్లను జాతీయ రోడ్డుగా ప్రకటించాలని నితిన్ గడ్కరీని కోరినట్లు ప్రశాంత్ రెడ్డివెప్పారు. 2019-20 సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రతిపాదిత ప్రణాళికను మంజూరు సీలింగ్‌ను పెంచాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ప్రశాంత్ రెడ్డి చెప్పారు. ఒక దేశం ఒక పన్ను విధానం కింద టోల్ ప్లాజాలను ఎలక్ట్రానిక్ టోల్ ప్లాజాలుగా తీర్చిదిద్దుతాం.. ఎలక్ట్రానిక్ విధానం గురించి అందరికీ అవగాహన కలిగేంత వరకు కొన్ని టోల్ కేంద్రాలను హైబ్రీడ్ టోల్ కేంద్రాలుగా తయారు చేస్తామని అన్నారు. టోల్ ప్లాజాలను ఎలక్ట్రానిక్ వ్యవస్థలోకి మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి అదనంగా 3,150 కిలోమీటర్ల జాతీయ రహదారులను ఇచ్చేందుకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు 1380 కిలోమీటర్లకు కేంద్రం నంబరింగ్ కూడా ఇచ్చిందని.. మిగతా కిలోమీటర్లకు కూడా వెంటనే నంబరింగ్ ఇవ్వాలని నితిన్ గడ్కరీని కోరినట్లు ఆయన చెప్పారు.

సిద్దిపేటలో తెలంగాణ భవన్ పూర్తి...ప్రారంభానికి సిద్ధం

సిద్దిపేట, అక్టోబర్ 15:సిద్దిపేట జిల్లా కేంద్రంలో పొన్నాల పరిధిలో నిర్మించిన టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ (పార్టి జిల్లా కార్యాలయ)ను సందర్శించిన మంత్రి హరీష్ రావు గారు క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగామంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ ఆఫీస్ లు జిల్లా కేంద్రాల్లో నిర్మిస్తున్నామని.. ఇప్పట వరకు నిర్మాణం పూర్తి అయిన కార్యాలయాల్లో రాష్ట్రంలోనే సిద్దిపేట పార్టీ కార్యాలయం అగ్రస్థానంలో ఉందని చెప్పారు.పార్టీ అధినేత , సీఎం కేసీఆర్ ఆదేశాలకు వారు చెప్పిన సమయానికి 3నెలలో పనులు చేపట్టామని ప్రారంభానికి సిద్ధం అయిందన్నారు.. త్వరలోనే సీఎం కేసీఆర్ గారిచే ప్రారంభించుకుంటామని చెప్పారు. సీఎం జిల్లాలో పార్టీ ఆఫీస్ అద్భుతంగా నిర్మించామని , రాష్ట్రంలో మన పార్టీ కార్యాలయం మోడల్ గా నిలవనుంది అన్నారు. షేడ్ నిర్మాణ పనులు , ప్రహరి గోడ నిర్మాణ పనులు పూర్తి , భవనం చుట్టూ మొక్కలు నాటాడం తో పచ్చదనంగా, విశాలంగా ఉంది .. ఈ సందర్భంగా నిర్మాణం చెపట్టడం లో పని చేసిన నిర్వహకులను అభినందించారు. తుది మెరుగులు పూర్తి చేయాలని అదేవిధంగా పలు సూచనలు చేశారు.

ఆర్టీసీ కార్మికులతో పెట్టుకొని..
కేసీఆర్ అగ్గితో గోక్కున్నాడు

– కేసీఆర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
– ఉప ఎన్నికల కోసమే కేకే చర్చల డ్రామా
– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

సూర్యాపేట, అక్టోబర్15 (ఆర్ ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులతో పెట్టుకొని సీఎం కేసీఆర్ అగ్గితో గోక్కున్నారని, మొండివైఖరితో తన పతనానికి తానే కొనితెచ్చుకుంటున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం సూర్యాపేటలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మాజీ ఎంపీ వివేక్‌తో కలిసి లక్ష్మణ్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులతో పెట్టుకుని కేసీఆర్ అగ్గితో గోక్కుంటున్నాడన్నారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను సెల్ఫ్ డిస్మిస్ చేయడం కాదు.. ప్రజలే కేసీఆర్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేస్తారని హెచ్చరించారు. హుజూంనగర్ ఎన్నికల కోసమే కేకే చర్చల డ్రామా ప్రారంభించారని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని రోజులు దసరా సెలవులు ఇచ్చిన ప్రభుత్వమే లేదన్నారు. టీఆర్ఎస్ మెడలు వంచే శక్తి బీజేపీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. కార్మికుల జీతాలు ఆపిన కేసీఆర్.. ఎమ్మెల్యేలు, ఎంపీల జీతాలు ఆపాడా అని ప్రశ్నించారు. సమ్మెను బూచిగా చూపి.. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడు పాల్గొనని మంత్రులు సమ్మె గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. కేసీఆర్ మొండి వైఖరి విడనాడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు బీజేపీ వారికి అండగా ఉంటుందని లక్ష్మణ్ స్పష్టం చేశారు.

వ్యక్తి దారుణ హత్య

సంగారెడ్డి. అక్టోబర్15(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని జహీరాబాద్ మండలం అల్లోల్‌లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. సుదర్శన్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి చెరువులో పడేశారు. సుదర్శన్ నాలుగు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పాత కక్ష్యలతోనే ఈ హత్య జరిగినట్లు స్థానికుల సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెక్నాలజీతోనే మరింత భద్రత సాధ్యం: అజిత్ దోవల్

హైదరాబాద్, అక్టోబర్ 15: ఢిల్లీలో జరుగుతున్న డీఆర్‌డీవో కాన్ఫరెన్స్‌లో జాతీయ భద్రతా సలహాదారుడు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ మాట్లాడారు. మనకు అనుగుణమైన టెక్నాలజీతో భారత్‌ను మరింత సురక్షితంగా తయారు చేయాలన్నారు. అవసరానికి తగినట్లుగా సాంకేతికను పెంచుకోవాలన్నారు. రక్షణ శాఖ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలతో కలిపి మనకు కావాల్సిన టెక్నాలజీ గురించి అంచనా వేయాలన్నారు. మన లోపాలను అధిగమించే టెక్నాలజీని పొందాలని దోవల్ తెలిపారు. మేటి ఆయుధాలు ఉన్న ఆర్మీ ఎప్పుడూ పైచేయి సాధిస్తుందని చెప్పారు. ఉత్తమ శ్రేణి టెక్నాలజీ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, కానీ భారత్ ముందు నుంచి రన్నరప్‌గానే ఉందని, రన్నరప్ కోసం ట్రోఫీ ఏమీ ఉండదన్నారు. ఉంటే మేటీగా ఉండాలి, లేకుంటే అలాంటిదేమీ ఉండదన్నారు. ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీ, డబ్బు ప్రాంతీయ రాజకీయాలను శాసిస్తాయన్నారు. అయితే ఈ రెండు అంశాలపై పట్టు ఉన్నవాళ్లు మాత్రమే విజయం సాధిస్తారని దోవల్ తెలిపారు. అయితే దీంట్లో టెక్నాలజీ అత్యంత కీలకమైందని అన్నారు.

(2019 సంక్రాంతి కథలపోటీ బహుమతి ప్రదాన సభ త్వరలో జరుగుతుంది.)

ఆహ్వానం

కవిసంధ్య

కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాం నిర్వహణలో

శిఖామణి సాహితీ పురస్కారం-2019 ప్రదానోత్సవ సభ

గ్రంథావిష్కరణ

కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు

సాంస్కృతిక కార్యక్రమం

సమయం
20 అక్టోబరు 2019, ఆదివారం
సా॥ 5.00 గం॥ల నుండి
వేదిక
యర్రా వెంకటరత్నం గీతాభవనం
కామిశెట్టివారి వీధి, యానాం

దాట్ల దేవదానంరాజు
అధ్యక్షులు, పురస్కార కమిటి

డా॥ శిఖామణి
అధ్యక్షులు, కవిసంధ్య

సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి ఇచ్చే
శిఖామణి సాహితీ పురస్కారం - 2019

పురస్కార గ్రహీత
శ్రీమతి ఓల్గా
ప్రముఖ రచయిత్రి,
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

గ్రంథావిష్కరణ
శిఖామణి కవితా సంపుటి
యానాం కవితలు
(Poems on Yanam)

కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు
సాహిత్య కళారంగాలలో సుప్రసిద్ధులైన ఎనమందుగురికి)

సాంస్కృతిక కార్యక్రమం
సా॥ 5 గం॥లకు
ప్రముఖ వేణుగాన విద్వాంసులు
శ్రీ గట్టి శ్రీకృష్ణదేవరాయలు
పిఠాపురం వారిచే వేణునాద విన్యాసం

సభా కార్యక్రమం: గం॥ 5.30 ని॥

ముఖ్య అతిథి
మాన్యశ్రీ మల్లాది కృష్ణారావు
ఆరోగ్యశాఖామాత్యులు, పుదుచ్చేరి ప్రభుత్వం

గౌరవ అతిథి
ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
పద్మభూషణ్ పురస్కృతులు
అధ్యక్షులు : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం

అధ్యక్షులు
శ్రీ కె.శివారెడ్డి
ప్రముఖకవి, సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత,
కన్వీనర్, తెలుగు సలహా మండలి సాహిత్య అకాడెమీ

పురస్కార గ్రహీత
శ్రీమతి ఓల్గా
ప్రముఖ రచయిత్రి

విశిష్ట అతిథులు
డా॥ డి.విజయభాస్కర్
ప్రముఖ నాటక రచయిత
కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు గ్రహీత
డా॥ ఆలూరి విజయలక్ష్మి
ప్రముఖ రచయిత్రి
శ్రీ ఖాదర్ మొహియుద్దీన్
ప్రముఖకవి, సీనియర్ పాత్రికేయులు

అవార్డు ప్రదానం
కళారత్న డా॥ శిఖామణి
సంపాదకులు, కవిసంధ్య,
సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు

ఆత్మీయ అతిథులు
కళైమామణి శ్రీ దాట్ల దేవదానంరాజు
ప్రముఖకవి, రచయిత
శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి
ప్రముఖకవి, ఆంధ్రకుదీరం, పల్లిపాలెం
డా॥ వరుగు భాస్కర్‌రెడ్డి
అధ్యక్షులు, తెలుగుశాఖ,
గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజి, యానాం

ఓల్గా సాహిత్యంపై ప్రసంగాలు
కవిత్వం:
డా॥ ఆర్. సీతారాం
ప్రముఖకవి, విమర్శకులు, కాళోజీ పురస్కార గ్రహీత
కల్పనా సాహిత్యం
డా॥ కె.ఎస్. మల్లేశ్వరి
ప్రముఖ రచయిత్రి, తానా పురస్కార గ్రహీత
'యానాం కవితలు' కావ్య సమీక్ష
శ్రీ బొల్లోజు బాబా
ప్రముఖకవి, అనువాదకులు
శ్రీ సిహెచ్. రాం
ప్రముఖకవి

ఆహ్వానం, సభానిర్వహణ
శ్రీ ముమ్మిడి శ్రీవీరనాగప్రసాద్
కవి, చిత్రకారులు

వందన సమర్పణ
శ్రీ పానుగుమట్ల అశోక్‌కుమార్
కవి, జర్నలిస్టు

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు
- డా॥ ఆలూరి విజయలక్ష్మి
ప్రముఖ రచయిత్రి, కాకినాడ
- శ్రీ ఎల్.ఆర్.స్వామి
ప్రముఖ రచయిత, అనువాదకులు, విశాఖపట్టణం
- శ్రీ సన్నిధానం నరసింహశర్మ
ప్రముఖకవి, విమర్శకులు, రాజమహేంద్రవరం
- శ్రీ అదృష్టదీపక్
ప్రముఖ కవి, సినీగేయ రచయిత, రామచంద్రపురం
- డా॥ శాంతినారాయణ
ప్రముఖ రచయిత, అనంతపురం
- డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు
ప్రముఖకవి, మృదంగ విద్వాంసులు, గుంటూరు
- శ్రీ ముప్వా శ్రీనివాసరావు
ప్రముఖకవి, ఖమ్మం
- డా॥ గూటం స్వామి
ప్రముఖకవి, రచయిత, రాజమహేంద్రవరం

ఓల్గా పరిచయం

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద రచయిత్రిగా సుప్రసిద్ధులైన శ్రీమతి ఓల్గా 27 నవంబరు 1950లో తెనాలిలో జన్మించారు. ఆమె అసలు పేరు పోపూరి లలితకుమారి. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి తెలుగు ఎం.ఎ.లో పట్టభద్రురాలైన ఓల్గా పైగంబర కవుల్లో ఒకరు. తెనాలి వి.ఎస్.ఆర్. కాలేజ్‌లో తెలుగు అధ్యాపకురాలిగా దశాబ్దం పైగా పనిచేసిన ఓల్గా ఆ తర్వాత పూర్తి స్థాయి స్త్రీవాద రచయిత్రిగా సాహిత్యంలోనికి వచ్చి ఆ రంగంలో విశేష కృషి చేశారు. ఫెమినిస్టు స్టడీ సర్కిల్‌ను రెండేళ్లు నిర్వహించి 'మాకు గోదలు లేవు' గ్రంథం ద్వారా స్త్రీవాద సిద్ధాంతాన్ని స్థిరీకరించే ప్రయత్నం చేసారు. అస్మిత, రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ సంస్థ వ్యవస్థాపక సభ్యులుగా, అధ్యక్షులుగా అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఓల్గా సంపాదకత్వంలో వచ్చిన తొలి స్త్రీవాద కవిత్వ సంకలనం 'నీలి మేఘాలు' తెలుగు సాహిత్యంలో కొత్త ఆలోచనలకు దారులువేసింది. స్వేచ్ఛ, మానవి, సహజ, కస్తూరి కెరటాలు, వెన్నెల, ఆకాశంలో సగం నవలలు, ప్రయోగం, భిన్న సందర్భాలు, మృణ్మయనాదం, విముక్త కథా సంకలనాలు ఓల్గాను తెలుగులో అగ్రేసర స్త్రీవాద రచయిత్రిగా నిలబెట్టాయి. ఆమె నవల 'స్వేచ్ఛ' అనేక విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగా ఉంది. ఎన్.బి.టి. ఈ నవలను అనేక భారతీయ భాషల్లో ప్రచురించింది. దైనా అమెరికా వంటి దేశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా సదస్సుల్లో పాల్గొన్నారు. 2015లో కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కారంతో పాటు తెలుగు యూనివర్సిటీ, రంగవల్లి, రామినేని, మాలతీ చందూర్, సుశీలా నారాయణరెడ్డి, లోకనాయక్, బొమ్మిదాల ఫౌండేషన్ వంటి పలు ప్రతిష్ఠాత్మక సంస్థలనుండి పురస్కారాలు అందుకున్నారు. అంతటి విదుషీమణికి చంద్రునికో నూలుపోగు చందాన శిఖామణి సాహితీ పురస్కారం అందిస్తుంది కవిసంధ్య.

టాప్ ర్యాంక్‌కు పాయింట్ దూరంలో విరాట్..

క్రీడలు

దుబాయి: టెస్టుల్లో టాప్ ర్యాంక్ కైవసం చేసుకోవడానికి భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఒకే ఒక్క పాయింట్ దూరంలో ఉన్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో కోహ్లి 936 పాయింట్లతో మొదటి స్థానానికి చేరువయ్యాడు. తొలి స్థానంలో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ స్టీవ్‌స్మిత్ 937 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో వీరోచిత డబుల్ సెంచరీ సాధించిన కోహ్లి 37 పాయింట్లు సాధించాడు. సౌతాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా మరో మ్యాచ్ మిగిలుండడంతో కోహ్లి టాప్ ర్యాంక్ చేరుకోవడం లాంఛనమే. యాషెస్ సిరీస్‌కు ముందు కోహ్లి అగ్రస్థానంలోనే ఉన్నాడు. కానీ, యాషెస్‌లో చెలరేగి ఆడిన స్మిత్, కోహ్లి నుంచి టాప్ ర్యాంక్‌ను లాక్కున్నాడు. కాగా, మూడో స్థానంలో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ 878 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా, భారత బ్యాట్స్‌మెన్ పుజారా, న్యూజీలాండ్ ఆటగాడు హెన్రీ నికోల్స్ 4, 5 స్థానాల్లో ఉన్నారు. భారత వైస్ కెప్టెన్ అజింక్యా రహానే 9వ స్థానంలో కొనసాగుతున్నాడు. వన్డేల్లో కోహ్లి అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

డీసీఎం వ్యాను బోల్తా: 10 మందికి తీవ్ర గాయాలు

నల్లగొండ, అక్టోబర్ 15: జిల్లాలోని నేరేడుగొమ్మ మండలం చిన్న మునిగల్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. చందంపేట మండలం గువ్వల గుట్టకి చెందిన 45 మంది కూలీలు మినీ డీసీఎం వ్యాను లో వెళుతుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో పదిమందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు.

కోటిమంది యువతకు ఉద్యోగాలు

మంచినీటి సమస్య పరిష్కరానికి పెద్దపీట
30వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం
సావర్కర్, పూలేలకు భారతరత్న కోసం పోరాటం
మహారాష్ట్ర ఎన్నికల ప్రణాళికలో బిజెపి హామీలు
సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలసి విడుదల చేసిన నడ్డా

ముంబై,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజెపి దూసుకుని పోతోంది. ఇప్పటికే ఆయా పార్టీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. ఇక తాజాగా అధికార భారతీయ జనతా పార్టీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు తమ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో యువతను, నిరుద్యోగులను, విద్యార్థులను ఆకట్టుకునే అంశాలను చేర్చింది. ఈ మేనిఫెస్టోను ముఖ్యమంత్రి ఫడ్నవీస్, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాలు ముంబైలో విడుదల చేశారు. నిరుద్యోగులను ఆకట్టుకునేలా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భం గా బీజేపీ తన మేనిఫెస్టోను విడుదల చేసింది. నిరుద్యోగులను ఆకట్టుకునేలా వారికోసం కోటి ఉద్యోగాలను భర్తీ చేస్తామని బీజేపీ తమ మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఇక రానున్న ఐదేళ్లలో గ్రామీణప్రాంతాల్లో 30వేల కిలోమీటర్ల మేరా రహదారుల నిర్మాణం చేపడుతామని మేనిఫెస్టోలో పొందుపర్చింది. నీటికొరత సమస్యను పరిష్కరిస్తాం అందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామని మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఇదే అంశమై ప్రతి ఒక్కరికీ ఇళ్లు అని మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఇక మహారాష్ట్రలో తాగునీటి కొరత ఎప్పుడూ ఉండనే ఉ ంటుంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది బీజేపీ. తిరిగి అధికారం లోకి వస్తే నీటికొరత సమస్యను పరిష్కరిస్తా మంటూ మేనిఫెస్టోలో చెప్పుకొచ్చింది. ఇదిలా ఉంటే విలువల తో కూడిన నాణ్యమైన విద్యకు పెద్ద పీట వేస్తామని కమలం పార్టీ మరో అంశంగా మేనిఫెస్టోలో చేర్చింది. డీవీ సావర్కర్, జ్యోతిరావు ఫూలేలకు భారతరత్న ఆయా వర్గాల ఓట్లను ఆకర్షించేందుకు బీజేపీ ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు వీడీ సావర్కర్, సామాజిక కార్యకర్త అంటరానితనంపై పోరాటం చేసిన జ్యోతిరావు ఫూలే, సావిత్రిభాయ్ ఫూలేలకు దేశఅత్యున్నత పౌరపుం స్కారం భారతరత్నతో గౌరవిస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చింది. మొత్తానికి అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ బీజేపీ మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించింది. మేనిఫెస్టో అంటే పేపర్ కాదని .. ప్రజలకు పార్టీలకు మధ్య ఒప్పంద పత్రామన్నారు. మహారాష్ట్రలో ఫడ్నవీస్ రాజకీయ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేశారని నడ్డా అన్నారు. ఐదేళ్ల క్రితం మహారాష్ట్ర అవినీతి రాష్ట్రంగా ఉండేదన్న.. నడ్డా..ఫడ్నవీస్ సారథ్యంలో అవినీతి రహిత పారదర్శక పాలన అందిస్తోం దని అన్నారు. కాగా బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో వ్యవసాయానికి 12 గంటల విద్యుత్. .సోలార్ పంప్స్ ఏర్పాటు, కొంకణ్ తీర ప్రాంత అభివృ ద్ధితోపాటు..ప్రతీ జిల్లాను జాతీయ రహదారులకు అనుసంధానిస్తామని పేర్కొంది. 21 మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 24 న ఫలితాలు వెలువడుతాయి. శివసేన బీజేపీలు పొత్తులో భాగంగా కలిసి పోటీచేస్తుండగా .. మరోవైపు కాంగ్రెస్ ఎన్సీపీలు కలిసి పోటీ చేస్తున్నాయి.



మహారాష్ట్ర ఎన్నికల ప్రణాళికను విడుదల చేసిన బిజెపి కార్యనిర్వాహక అధ్యక్షుడు నడ్డ.చిత్రంలో సిఎం ఫడ్నవీస్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సమ్మె వెనుక టీఆర్ఎస్ నేతలు!

– ఆపేర్లను సీఎం కేసీఆర్‌కు చెబుతా
– సంచలన వ్యాఖ్యలు చేసిన టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్15 (ఆర్ ఎన్ఎ) : తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు సమ్మె తీవ్రమైన సంగతి తెలిసిందే. టీఆర్ఎస్ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు కేశవరావు ఆర్టీసీ యూనియన్లు, జేఏసీ నేతలతో చర్చిస్తామని ప్రకటించడంతో.. చర్చలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో జనగామ టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ సమ్మె వెనుక టీఆర్ఎస్ పార్టీ వాళ్లే ఉన్నారని.. వాళ్లే సమ్మెకు ఆజ్యం పోస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని ఆయన.. సమ్మెక వెనుక నేతల పేర్లు సీఎం కేసీఆర్‌కు చెబుతానని ముత్తిరెడ్డి చెప్పుకొచ్చారు. ముత్తిరెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీ యాంశమయ్యాయి. ఇంతకీ ముత్తిరెడ్డి చెబుతున్న ఇంటి దొంగలు ఎవరు అనే అంశంపై పలు గుసగుసలు తీవ్రమ య్యాయి. పది రోజులుగా ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మె చేయడం కొత్తేమీ కాదు. కానీ ఈసారి అటు కార్మికులు, ఇటు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక చర్చల్లేవ్ ఓన్లీ యాక్షనే అనే స్థాయికి పరిస్థితి వెళ్ళిందంటే మధ్యలో ఎవరో నిప్పు రాజేసి వుంటారని పలువురు భావిం చారు. అయితే.. దీనికి కారణం టిఆం ఎస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయా లనుకుంటున్న ప్రతిపక్ష పార్టీలు, వాటి నేతలే అని అందరూ భావిస్తున్నారు. కార్మిక సంఘాల ఆందోళనలో పాల్గొం టున్న రాజకీయ నాయకులు.. సమ్మె పరిష్కారానికి మార్గాలు చూపకుండా.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపో యడం.. కార్మిక సంఘాల నేతలను మరింత రెచ్చగొ ట్టడమే పనిగా పెట్టుకున్నాయి. ఈ క్రమ ంలో ఆర్టీసీ సమ్మె ప్రభుత్వానికి, ప్రతిప క్షాలకు మధ్య పోరాటంగా మారుతు న్నట్లు కనిపిం చింది. అయితే అనూహ్యా ంగా ఇపుడు ముత్తిరెడ్డి చేసిన వ్యాఖ్యలు కొత్త దుమారానికి తెరలేపా యి. అధికార పార్టీ నేతలే ఆర్టీసీ కార్మిక సంఘ ాలను రెచ్చగొట్టి సమ్మెలోకి దింపాయ ంటూ ఆయన చేసిన కామెంట్ కాకరేపు తోంది. నిక్కచ్చిగా వ్యవహరించే కెసీఆర్ కు వ్యతిరేకంగా సమ్మె కుంపటి రాజేసే ధైర్యం టిఆర్ఎస్ పార్టీలో ఎవరికుందన్న చర్చ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సాగుతుంది.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

– గిట్టుబాటు ధరతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం దొరుకుతుంది
– ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు
– రైతులకు ఉచితంగా పాడి ఆవులను పంపిణీచేసిన మంత్రి

సిద్దిపేట, అక్టోబర్15(ఆర్ఎన్ఎ) : రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తే గిట్టుబాటు ధరతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం దొరుకుతుందని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు వ్యాఖ్యానించారు. మంగళవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో మంత్రి 200 మంది రైతులకు పాడి ఆవులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆవులు మంచి సెంటిమెంట్ అని ఏ పూజ చేసినా, పుణ్యకార్యం చేసినా గోపూజ ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆవులను తరలించామని, అలసిపోయుంటాయి కాబట్టి రైతులు వాటికి వేడి నీళ్లతో స్నానం చేయించాలని సూచించారు. లక్ష రూపాయలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన ఆవులకు తగిన ఇన్సూరెన్స్ కూడా చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహ కరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఒక పక్రియలా నిరంతరం కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసా యంలో అధిక దిగుబడి సాధించిన నియోజకవర్గ రైతులను హరీష్‌రావు సన్మానించారు.

తెలంగాణ భవన్‌ను పరిశీలించిన మంత్రి..

సిద్దిపేట జిల్లా కేంద్రంలో పొన్నాల పరిధిలో నిర్మించిన టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ (పార్టీ జిల్లా కార్యాలయ)ను మంత్రి హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీ ఆఫీస్‌లు జిల్లా కేంద్రాల్లో నిర్మిస్తున్నామని, ఇప్పటివరకు నిర్మాణం పూర్తి అయిన కార్యాలయాల్లో రాష్ట్రంలోనే సిద్దిపేట పార్టీ కార్యాలయం అగ్రస్థానంలో ఉ ందని చెప్పారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆదేశాలకు వారు చెప్పిన సమయానికి 3నెలలో పనులు చేపట్టామని ప్రారంభానికి సిద్ధం అయిందన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్ గారిచే ప్రారంభించుకుంటామని చెప్పారు. సీఎం జిల్లాలో పార్టీ ఆఫీస్ అద్భుతంగా నిర్మించామని, రాష్ట్రంలో మన పార్టీ కార్యాలయం మోడల్ గా నిలవనుంది అన్నారు. షేడ్ నిర్మాణ పనులు, ప్రహరి గోడ నిర్మాణ పనులు పూర్తి , భవనం చుట్టూ మొక్కలు నాటాడం తో పచ్చదనంగా, విశాలంగా ఉందని.. ఈ సందర్భంగా నిర్మాణం చెపట్టడంలో పనిచేసిన నిర్వహకులను అభినందించారు. తుది మెరుగులు పూర్తి చేయాలని మంత్రి హరీష్‌రావు సూచించారు.

సోదరి ఆత్మహత్యతో ఆగ్రహం

బావను చంపిన బావమర్ది

ముంబయి,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): పోలీసుల కళ్లెదుటే బావను బామ్మర్ది విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి చంపాడు. ఈ దారుణ ఘటన మహా రాష్ట్రలోని నల్లసోపారా పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం సాయం త్రం చోటు చేసుకుంది. ఆకాశ్ కోలేకర్, కోమల్(20)కు ఏడాది క్రితం వివాహ మైంది. ఇరువురి మధ్య స్వల్ప వివాదా లు చోటు చేసుకుంటున్నాయి. శనివారం రాత్రి దంపతుల మధ్య జరిగిన ఘర్షణ కోమల్ ఆత్మహత్యకు దారి తీసింది. తను ఉంటున్న ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షిం చారు. అనంతరం కోమల్ తల్లిదండ్రు లు, ఆమె సోదరుడు రవీంద్ర కాలేద (25)కు పోలీసులు సమాచారం ఇచ్చా రు. ఆకాశ్ కోలేకర్‌ను పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. అయితే ఆకాశ్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్న సమయంలో.. రవీంద్ర నేరుగా అక్కడికి వెళ్లి బావపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కత్తిపోట్లకు గురైన ఆకాశ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్ నిర్లక్ష్యంతో బాలిక మృతి

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

హైదరాబాద్,అక్టోబర్15 (ఆర్ ఎన్ఎ): డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ యాదేందర్ కథనం ప్రకారం .. బర్కా స్ ప్రాంతానికి చెందిన అసన్ జాబ్రీ, ఖాజబీ దంపతుల ఏకైక కుమార్తె ఫాతిమా జంతిస్తాన్ జాబ్రీ(11) 4వ తరగతి చదువుతుంది. దసరా పండుగకు నల్లకుంటలో ఉండే చిన్నమ్మ ఇంటికి ఫాతిమా వచ్చింది. వచ్చిన రెండు రోజులకే ఫాతిమాకు డెంగీ జ్వరం వచ్చింది. మెరుగైన వైద్యం కోసం ఈ నెల 10న నుందం నగర్‌లోని శిఫా క్లినిక్‌కు తీసుకెళ్లా రు. డాక్టర్ మహ్మద్ మందులు ఇచ్చి పంపించాడు. రెండు రోజులైనా తగ్గకపోవడంతో మళ్లీ 12న రాత్రి క్లినిక్‌కు వచ్చారు. అప్పుడు కూడా ఫాతిమాకు కొత్త మందులు ఇచ్చి పంపించాడు. ఆ రాత్రి ఫాతిమా డాక్టర్ ఇచ్చిన ట్యాబ్‌లెట్ వేసుకొని పడుకుంది. తెల్లవారు 10 గంటలైనా లేవకపోవ డంతో అనుమానం వచ్చిన తల్లి, చిన్నమ్మ ఫాతిమాను విద్యానగర్‌లోని ఆంధ్ర మహిళా సభ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమించిందని చెప్పగా.. గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫాతిమా ఆదివారం రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి భారీ అగ్నిప్రమాదం

మేడ్చల్ మల్కాజ్‌గిరి. అక్టోబర్ 15: జిల్లాలోని మేడ్చల్ మండలం రాజాబొల్లారం తండాలో అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్ నింపుతుండగా అది పేలిపోయింది. ఈ ప్రమాదంలో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో పాపకు స్వల్పగాయాలయ్యాయి. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.

అదుపుతప్పి బోల్తా పడ్డ డిసిఎం

నల్లగొండ,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలోని నేరేడుగొమ్మ మండలం చిన్న మునిగల్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. చందంపేట మండలం గువ్వలగుట్టకి చెందిన 45 మంది కూలీలు మినీ డీసీఎం వ్యానులో వెళుతుండగా అదుపు తప్పి బోల్తాప డింది. ప్రమాదంలో పదిమందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు.

నలుగురు దొంగల అరెస్ట్

హైదరాబాద్,అక్టోబర్15 (ఆర్ఎన్ఎ): నగరంలో ఇంటి తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్న నలుగురు పాత నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. చాదర్ ఘాట్ సమీపంలో తెల్లవారుజామున జరిగిన చోరీలో మహమ్మద్ ఖాదర్ అలియాస్ ఆయుబ్, జామిమ్, మాక్దూమ్, వేముల సాయి కుమార్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 12 లక్షలు నగదు, 22 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులు నమోదు అయ్యాని సీపీ అంజనీకుమార్ తెలిపారు.

ఆలయాల్లో దొంగతనం అనుమానం

వ్యక్తిని చితకబాదడంతో మృతి

నిజామాబాద్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలోని ధర్మారం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడని భావించిన గ్రామస్తులు ఓ వ్యక్తిని చితకబాదారు. తీవ్రంగా గాయపడిన అతడిని కొందరు వ్యక్తులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న భాదితుడు పరిస్థితి విషమించడంతో మరణించాడని డాక్టర్లు తెలిపారు. మృతుడు గంగాధర్ అని, అతడు నిజామాబాద్ మండలం అర్సపల్లి నివాసి అని వారు తెలిపారు. మేస్త్రి పని నిమిత్తం అతడు ఖానాపూర్‌లో నివాసముంటున్నట్లు సమాచారం.

రొమాంటిక్ చిత్రం సెట్‌లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): పూరీ జగన్నాథ్ నిర్మాణంలో ఆకాశ్ పూరి, కేతికా శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం రొమాంటిక్. అనీల్ పాడూరి చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇటీవల చిత్ర ఫస్ట్ లుక్ విడుదల కాగా, ఇందులో హీరో హీరోయిన్స్ చాలా రొమాంటిక్‌గా కనిపించారు. ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ మెస్మరైజ్ చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటులు మకరంద్ దేశ్ పాండే, మందిరాబేడీ కీలకపాత్రలో నటిస్తున్నారు. అయితే చిత్ర షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో జరుగుతుండగా, సెట్‌లో ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. దీంతో సెట్ ప్రాపర్టీ కొంత దెబ్బతిన్నట్టు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అంటున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.